సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 25 । ఏప్రిల్ । 2024



విద్యార్థుల తికమక

నేటి నుంచి ఓపెన్ పది, ఇంటర్ పరీక్షలు ప్రారంభమవుతుండగా, పరీక్ష కేంద్రాలను గుర్తించడంలో విద్యార్థులు తికమక పడుతున్నారు. IIలో



'కేటీపీఎస్'లో గందరగోళం

కేటీపీఎస్ నుంచి బదిలీ అయిన ఉద్యోగులు సైతం ఇక్కడి సొసైటీలోనే సభ్యులుగా కొనసాగుతామనడంతో గందరగోళం నెలకొంది. IIలో

గరిష్టం / కనిష్టం
41° / 26°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఎండ మొదలై మధ్యాహ్నానికి మరింతగా పెరుగుతుంది. రాత్రి కూడా వేడిగానే ఉంటుంది.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణం బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

మంత్రి క్షేత్రాన్ని పరిశీలించిన ములుగు జిల్లా రైతులు



ఆయిల్‌పామ్ వివరాలు వెల్లడిస్తున్న మంత్రి తుమ్మల

దమ్మపేట: ఆయిల్ పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన మెళకువలపై రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ములుగు జిల్లా రైతులకు అవగాహన కల్పించారు. దమ్మపేట మండలం గండుగులపల్లిలోని మంత్రి తుమ్మల ఆయిల్‌పామ్ క్షేత్రాలను ములుగు జిల్లాకు చెందిన పలువురు రైతులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి వారికి ఆయిల్ పామ్ మొక్క నాటినప్పటి నుండి, కాపు దశకు వచ్చే వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే, అదనపు ఆదాయం కోసం సాగుకు అనువైన అంతర పంటల వివరాలు వెల్లడించారు. కాపునకు వచ్చిన ఆయిల్‌పామ్ గెలలను చూపించి.. వ్యయం, ఆదాయాలపై అవగాహన కల్పించారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు ఎంపిక



అనురాధ

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 25, 26 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌కు కొత్తగూడెం బూడిదగడ్డ ప్రభుత్వ పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయురాలు గుంటి అనురాధ ఎంపికయ్యారు. గురువారం ఆన్‌లైన్ మీట్‌లో అనురాధ పేపర్ ప్రజంటేషన్ ఇవ్వనున్నారు. అనురాధ గత ఎనిమిదేళ్లుగా రాష్ట్రస్థాయి సెమినార్‌కు ఎంపికవుతున్నారు. గతేడాది దక్షిణ భారత స్థాయి సైన్స్‌ఫేర్‌కు కూడా ఆమె ఎంపికయ్యారు.

బాలికలదే హవా



ఇంటర్మీడియట్‌లో బాలికలు సత్తా చాటారు. బుధవారం విడుదలైన ఫలితాల్లో వారిదే పైచేయిగా నిలిచింది. జిల్లాలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో కలిపి మొత్తం 10,919 మంది బాలికలు పరీక్షలు రాయగా, 7,675 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రథమ సంవత్సరంలో బాలురు 3,400 మందికి 1,582 మంది, ఒకేషనల్‌లో 1,163 మంది పరీక్ష రాయగా 434 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 4,563 మంది పరీక్షలు రాయగా 2,016 మంది ఉత్తీర్ణులయ్యారు. మొదటి సంవత్సరంలో బాలికలు 5,643 మంది పరీక్ష రాయగా, 3,580 మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 10,206 మందికి 5,596 ఉత్తీర్ణులు కాగా, 54.83 శాతం మేర నమోదైంది. ద్వితీయ సంవత్సరంలో బాలురు 4015 మంది పరీక్ష రాయగా 2,491 మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 5,276 మందికి 4,065 మంది ఉత్తీర్ణత సాధించారు. జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో కలిపి 9,291 మందికి 6,556 మంది ఉత్తీర్ణులు కాగా, 73.72 శాతంగా నమోదైంది. – కొత్తగూడెంఅర్బన్

ఇంటర్మీడియట్‌లో సత్తాచాటిన అమ్మాయిలు

- జిల్లాలో ప్రథమ సంవత్సరంలో 54.83 శాతం ఉత్తీర్ణత
- ద్వితీయ సంవత్సరంలో 70.72 శాతం..
- ప్రతిభ చాటిన కేజీబీవీ విద్యార్థినులు
- రాష్ట్రస్థాయిలో జిల్లాకు 9వ స్థానం

ప్రతిభ చాటిన కస్తూర్బా కళాశాలలు..

జిల్లాలోని కస్తూర్బా(కేజీబీవీ) కళాశాలల విద్యార్థినులు ఫలితాల్లో ప్రతిభ చాటారు. మొదటి సంవత్సరంలో 75.39 శాతం ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 88.32 శాతం నమోదైంది. ములకలపల్లి కేజీబీవీకి చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థిని బి.కుసుమకుమారి ఎంపీహెచ్ డబ్ల్యూ గ్రూప్‌లో 978 మార్కులు సాధించి సత్తా చాటింది. ఇదే కళాశాలకు చెందిన పి.సౌమ్య ప్రథమ సంవత్సరం ఎంపీహెచ్ డబ్ల్యూ గ్రూప్‌లో 493 మార్కులు సాధించడం విశేషం. చర్ల, దుమ్ముగూడెం, గుండాల, జూలూరుపాడు కేజీబీవీలు సైతం ప్రథమ సంవత్సర ఫలితాలు 100 శాతం సాధించాయి. ద్వితీయ సంవత్సరంలో దుమ్ముగూడెం, జూలూరుపాడు కళాశాలలు 100 శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి.



అత్యధిక మార్కులు సాధించిన కుసుమ

రాష్ట్రంలో తొమ్మిదో స్థానం..

ఇంటర్ ఫలితాల్లో జిల్లా రాష్ట్ర స్థాయిలో నిలిచిందని కలెక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఉత్తీర్ణత శాతం మెరుగుపడడం పట్ల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఇంటర్‌మీడియట్ విద్యాశాఖ అధికారులను ఆమె అభినందించారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ కలగాలని ఆకాంక్షించారు.



ప్రథమ సంవత్సరంలో ప్రతిభ చాటిన సౌమ్య

ప్రభుత్వ కళాశాలలో ఇలా..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగానికి చెందిన బి.నవీన్‌కుమార్ 917 మార్కులు సాధించడం విశేషం. ఇదే కళాశాలలోని ఎం.మోహన్ 880 మార్కులు, ద్వితీయ సంవత్సరం బైపీసీలో టి.హాసిని 944 మార్కులు, కె.నవ్యశ్రీ 944 మార్కులు, సీఈసీ విభాగంలో ఎల్.శిరీషా 834 మార్కులు, హెచ్ఈసీ విభాగంలో అమన్‌పాషా 818 మార్కులు, వొకేషనల్ విభాగంలో వై.అయేషా 988 మార్కులు సాధించి సత్తా చాటింది. దీంతో పాటుగా ఒకేషనల్‌లోనే ఈ.మనీష్ 951 మార్కులు, ఆర్.శివమణి 950 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. వీరిని పలువురు అభినందించారు.

గురుకులాల్లో తగ్గుతున్న ఫలితాలు

సమీక్షిస్తున్న ఐటీడీఏ అధికారులు

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాలల్లో 2023 – 24 విద్యా సంవత్సరంలో ఇంటర్ ఫలితాల శాతం గతేడాది కంటే తగ్గింది. ఖమ్మం రీజియన్ పరిధిలోని 21 కళాశాలల్లో గతేడాది మొదటి సంవత్సరలో 80.54 శాతం, ద్వితీయ సంవత్సరంలో 87.75 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో మొదటి సంవత్సరంలో బాలికలు 923 మంది పరీక్షలు రాయగా 689 మంది ఉత్తీర్ణులు కాగా 234 మంది ఫెయిలయ్యారు. 74.65 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 76.40 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. ఇక బాలురు 520 మంది పరీక్ష రాయగా 327 మంది ఉత్తీర్ణులై 193 మంది ఫెయిలయ్యారు. ఉత్తీర్ణత శాతం 62.88గా నమోదు కాగా, గతేడాది 75.22 శాతం వచ్చింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రథమ సంవత్సర విద్యార్థులు 1,443 పరీక్షలు రాయగా 1,016 మంది మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరములో బాలికలు 868 మందికి 733, బాలురు 507 మందికి 412 మంది ఉత్తీర్ణులయ్యారు. దీంతో 81.26 శాతం ఉత్తీర్ణత నమోదైంది. గతేడాది 87.32 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. గతేడాది కంటే ఎక్కువగా కృషి చేసినా ఫలితాలు తగ్గడం పట్ల ఐటీడీఏ అధికారులు సమీక్షిస్తున్నారు. వచ్చే సంవత్సరమైనా మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కసరత్తు చేస్తున్నారు.

పకడ్బందీగా పోల్ స్లిప్పుల పంపిణీ

కలెక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ స్లిప్పుల పంపిణీని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి, తుది ఓటర్ జాబితాలను వారికి అందించాలని చెప్పారు. పోలింగ్ సిబ్బంది రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ సకాలంలో జరిగేలా చూడాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అంతకుముందు నామినేషన్ల పరిశీలన, బ్యాలెట్ పేపర్ల ముద్రణ తదితర అంశాలపై రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రియాంక ఆల పాల్గొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కాశయ్య, సుమ, భద్రాచలం ఆర్‌డీఓ దామోదర్, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు తక్కువ వడ్డీకే రుణాలు

ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంఅర్బన్ : ఆదివాసీ గిరిజన రైతుల అవసరాలను ఆసరా చేసుకుని వ్యాపారులు అధిక వడ్డీలకు డబ్బు ఇస్తున్నారని, పంట చేతికి రాగానే వారు నిర్ణయించిన ధరకే రైతులు అమ్ముకోవాల్సి వస్తోందని, దళారుల బారి నుంచి రైతులను ఆదుకునేలా ప్రణాళిక సిద్ధం చేయాలని ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో పినపాక, మణుగూరు తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఐకేపీ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు ఆర్థిక వెసులుబాటు కల్పిస్తూ తక్కువ వడ్డీతో రుణాలు అందించేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. వర్షాలు పడగానే రైతులు సాగుకు సన్నద్ధమవుతారని, ఈ సమయంలో ఐకేపీ ఏపీఎంలు, సీసీలు, మండల సమైక్య సభ్యులు వీవో ద్వారా రైతులకు అవగాహన కల్పించి తక్కువ వడ్డీతో ఆర్థిక సహాయం చేయాలని, తిరిగి వసూలు చేయాలని సూచించారు. మణుగూరు పినపాక మండలాల గిరిజన రైతులకు ఐకేపీ సిబ్బంది ఈ మేరకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని అన్నారు. రైతు వేదికలు అందుబాటులో ఉన్న చోట గిరిజన రైతులను సమావేశపరచి వారికి ఎంత డబ్బు అవసరమో అంత ఇప్పించాలని చెప్పారు. సమావేశంలో ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఖమ్మం డీడీ విజయలక్ష్మి, సురేష్ బాబు, ఏటీడీఓ నరసింహారావు, మణుగూరు, పినపాక తహసీల్దార్లు రాఘవరెడ్డి, రామకృష్ణ, ఎంపీడీఓలు శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

రఘురాముడికే జై..

- కాంగ్రెస్ అభ్యర్థిగా 'రామసహాయం'
- ఖమ్మం స్థానంపై సుదీర్ఘ నిరీక్షణకు తెర
- తర్జన భర్జన అనంతరం మాజీ ఎంపీ కుమారుడి పేరు ఖరారు
- నేడు నామినేషన్ దాఖలుకు ఏర్పాట్లు



దీపాదాస్ మున్షీ నుంచి బీ ఫామ్ స్వీకరిస్తున్న రఘురాంరెడ్డి, పక్కన మాజీ ఎంపీ సురేందర్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా రామసహాయం రఘురాంరెడ్డి బరిలోకి దిగుతున్నారు. సుదీర్ఘ నిరీక్షణకు తెర దించుతూ ఏఐసీసీ బుధవారం రాత్రి ఆయనను అభ్యర్థిగా ప్రకటించింది. రాష్ట్రంలోని మిగతా స్థానాలకు చాన్నాళ్ల క్రితమే అభ్యర్థులను ప్రకటించగా ఖమ్మంతో పాటు హైదరాబాద్, కరీంనగర్ పేర్లపై జాప్యం జరిగింది. ఖమ్మంలో తెరపైకి పలువురి పేర్లు రావడం, సామాజిక సమీకరణలు, రాజకీయ అంశాలను పరిగణనలోకి తీసుకుని చివరకు రఘురాంరెడ్డి అభ్యర్థిత్వం వైపే కాంగ్రెస్ అధిష్టానం మొగ్గుచూపింది. కాగా, రఘురాంరెడ్డి తరఫున మంగళవారమే ఆ పార్టీ నాయకులు రెండు సెట్ల నామినేషన్లు సమర్పించారు. ఇక బుధవారం అభ్యర్థిత్వం ఖరారు కావడంతో గురువారం ఆయన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో కలిసి చివరి సెట్ నామినేషన్ దాఖలు చేస్తారని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈమేరకు ఉదయం 10 గంటలకు కాల్వొడ్డు నుంచి మొదలయ్యే ర్యాలీకి కాంగ్రెస్ శ్రేణులు తరలిరావాలని కోరారు.

చర్చోపచర్చలు..

ఖమ్మం అభ్యర్థి ఎంపికపై హైదరాబాద్‌లో పలుమార్లు ఏఐసీసీ దూతలు చర్చలు జరిపినా కొలిక్కి రాకపోవడంతో ఆ తర్వాత వ్యవహారం హస్తినకు చేరింది. గత సోమవారం బెంగళూరులో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో భేటీ అయ్యారు. అలాగే ఖమ్మంలో ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభిప్రాయం కూడా సేకరించారు. ఆపై రఘురాంరెడ్డి అభ్యర్థిత్వానికి ఏఐసీసీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.

ఎక్కువ మంది పోటీ పడడంతో

కాంగ్రెస్ తరఫున ఖమ్మం నుంచి పోటీ చేస్తే గెలుపు సునాయాసమనే ధీమా పార్టీ నేతల్లో ఉంది. దీంతో ఇక్కడి నుంచి పోటీకి ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్ర స్థాయి నేతలు పోటీ పడ్డారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సతీమణి నందిని, మంత్రులు పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డి, తుమ్మల తనయుడు యుగంధర్, వ్యాపారవేత్త వంకాయలపాటి రాజేంద్రప్రసాద్‌తో పాటు నేతలు వీహెచ్, జెట్టి కుసుమకుమార్, పోట్ల నాగేశ్వరరావు, రాయల నాగేశ్వరరావు, మానుకొండ రాధాకిషోర్, నాగా సీతారాములు, లోకేష్‌యాదవ్ తదితరులు టికెట్ ఆశించారు. రాజకీయ నేపథ్యం, సామాజిక సమీకరణలు దృష్టిలో పెట్టుకుని టికెట్ ఇవ్వాలంటూ చివరి వరకు ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యాన ఏఐసీసీ సర్వే కూడా చేయించినట్లు సమాచారం. అయినా అభ్యర్థి ఎంపిక విషయంలో మాత్రం తర్జనభర్జన పడగా.. నామినేషన్ గడువు ముగిసే ముందురోజు రఘురాంరెడ్డి పేరు ఖరారు చేశారు.

తెరపైకి పలువురి పేర్లు..

ఏఐసీసీ అభ్యర్థుల జాబితా ప్రకటించిన ప్పుడల్లా ఖమ్మం అభ్యర్థి ఫలానా అంటూ వారి అనుచరగణం సోషల్ మీడియాలో ఊదరగొట్టింది. చివరకు పొంగులేటి ప్రసాదరెడ్డి, నిజామాబాద్‌కు చెందిన మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు, జిల్లాకు చెందిన రాయల నాగేశ్వరరావు, రామసహాయం రఘురాంరెడ్డిల్లో ఒకరికి టికెట్ ఖరారవుతుందని ప్రచారం జరిగింది. సామాజిక సమీకరణల నేపథ్యాన మండవకు టికెట్ అని, ఇంకొందరు పొంగులేటి కుటుంబానికే టికెట్ అని ప్రచారం చేశారు. ఇక బుధవారం కూడా ఏఐసీసీ అగ్రనేత ప్రియాంకగాంధీ పేరు తెరపైకి రావడం గమనార్హం. అయితే, అటు మంత్రులు, ఇటు జిల్లా ఎమ్మెల్యేల అభిప్రాయాలు సేకరించాక రఘురాంరెడ్డి వైపే హస్తం అధిష్టానం మొగ్గుచూపింది.

బయోడేటా

పేరు : రామసహాయం రఘురాంరెడ్డి
పుట్టిన తేదీ, స్థలం : 1961 డిసెంబర్ 19
స్వస్థలం : చేగొమ్మ, కూసుమంచి మండలం
తల్లిదండ్రులు : జయమాల – రామసహాయం సురేందర్‌రెడ్డి
విద్యాభ్యాసం : హైదరాబాద్ నిజాం కళాశాలలో బీకాం, పీజీ డిప్లొమా
కుటుంబం : కుమారులు వినాయక్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి
(వీరిలో వినాయక్‌రెడ్డి సినీ హీరో దగ్గుబాటి వెంకటేష్ పెద్ద కుమార్తె ఆశ్రితను, అర్జున్‌రెడ్డి రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమార్తె సప్నిరెడ్డిని వివాహం చేసుకున్నారు.)
రాజకీయ నేపథ్యం : రఘురాంరెడ్డి తండ్రి రామసహాయం సురేందర్‌రెడ్డి కాంగ్రెస్ సీనియర్ నాయకుడిగా వ్యవహరించారు. డోర్నకల్ నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా, మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి ఓ సారి, వరంగల్ లోక్‌సభ నుంచి మూడుసార్లు ఎంపీగా గెలిచారు. ఇక రఘురాంరెడ్డి 1985 నుంచి కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. దివంగత ప్రధానులు ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, పీవీతో వీరి కుటుంబానికి సాన్నిహిత్యం ఉంది.
పదవులు : రఘురాంరెడ్డి 1985లో డోర్నకల్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరించారు. 1989, 1991లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రెండు అసెంబ్లీ స్థానాలు, వరంగల్ లోక్‌సభకు ఇన్‌చార్జిగా పనిచేశారు. అలాగే, 2011–13లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ప్యాటరన్‌గా బాధ్యతలు నిర్వర్తించగా, ఇప్పుడు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్‌లో వైస్ చైర్మన్‌గా, హైదరాబాద్ రేస్‌క్లబ్ బోర్డు సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు.

కేసీఆర్ హయాంలోనే అభివృద్ధి

- ఇప్పుడు ప్రజలెవరూ ఆనందంగా లేరు
- పాలేరు ప్రాజెక్టు గేట్లు రైతులే ఎత్తే పరిస్థితి వచ్చింది
- ముగ్గురు మంత్రులున్నా ప్రజల కష్టాలను తీర్చడం లేదు..
- కాంగ్రెస్ నేలకు దిగి రావాలంటే నామను గెలిపించాలి
- బీఆర్ఎస్ సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు



మాట్లాడుతున్న హరీశ్‌రావు, పక్కన ఎంపీ అభ్యర్థి నామ, ఎంపీ వద్దిరాజు, జెడ్పీ చైర్మన్ కమల్ రాజ్, ఎమ్మెల్సీ మధు, మాజీ మంత్రులు పువ్వాడ, వనమా, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర, మెచ్చా

సాక్షిప్రతినిధి, ఖమ్మం: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హయాంలోనే ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి చెందగా.. రెండు జిల్లాల్లో మెడికల్ కాలేజీలు, సీతారామ ఎత్తిపోతల పథకం, గ్రానైట్ పరిశ్రమకు 40 శాతం రాయితీలు ఇచ్చామని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు వెల్లడించారు. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ హయాంలో ఏ వర్గం ప్రజలు సంతోషంగా లేరని పేర్కొన్నారు. ఖమ్మం లోక్‌సభ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి నామ నాగేశ్వరరావు బుధవారం నామినేషన్ దాఖలు చేయగా... ఆతర్వాత ఏర్పాటుచేసిన పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడారు. తాగు, సాగునీటి కోసం జిల్లా ప్రజలు, రైతులు తండ్లాడుతుంటే మంత్రులు మాత్రం వారి కుటుంబీకులకు టికెట్ కోసం ఢిల్లీ, బెంగళూరు చుట్టూ చక్కర్లు కొడుతున్నారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పాలేరు ఆయకట్టు కింద రైతులే ప్రాజెక్టు గేట్లు ఎత్తుకోవాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. నాడు వర్షాలతో జిల్లాలో పంటలు దెబ్బతింటే ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనకల్ మండలంలో పర్యటించి పరిహారం ఇచ్చారని, గ్రానైట్ పరిశ్రమకు రాయితీలు ఇస్తే ఇప్పటి ప్రభుత్వం రద్దు చేసిందని ఆరోపించారు. అలాగే, ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలను మంత్రులు పరామర్శించారా అని ప్రశ్నించారు. రైతులు, మహిళలు, పేదలు, నిరుద్యోగులు, ఉద్యోగులు, గొల్లకురుమలు, ఆటో డ్రైవర్లు ఇలా అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేయగా.. ఎంపీ ఎన్నికల్లో మాదిగలకు ఒక్క సీటూ ఇవ్వకుండా వారి ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ దెబ్బతీసిందన్నారు. అదే బీఆర్ఎస్ నుంచి మాదిగలకు రెండు ఎంపీ టికెట్లు ఇవ్వడమే కాక బీసీలకు ప్రాధాన్యం ఇస్తూ ఉన్న ఒక్క రాజ్యసభ సీటును కేసీఆర్ వద్దిరాజు రవిచంద్రకు కేటాయించారని హరీశ్‌రావు తెలిపారు. ఈమేరకు కాంగ్రెస్ హామీలతో మోసపోయామని గుర్తించిన ప్రజల వద్దకు వెళ్లి ఎంపీగా నామ గెలుపునకు నేతలు, కార్యకర్తలు పాటుపడాలని కోరారు. ఖమ్మంలో నామ నాగేశ్వరరావును గెలి పిస్తేనే కాంగ్రెస్‌కు కనువిప్పు కలిగి ఆరు గ్యారంటీలు అమలుచేస్తారని తెలిపారు.

ఎవరేం అన్నారంటే...

- లోక్‌సభ ఎన్నికలను కేడర్ కీలకంగా భావించి కలిసికట్టుగా నామ విజయానికి కృషి చేయాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కోరారు. నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం తమను ఎలా మోసం చేసిందో ప్రజలు గమనించారన్నారు. షాదీముబారక్, కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ అన్నీ రద్దు అయ్యాయని తెలిపారు.
- తెలంగాణ హక్కుల కోసం పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని, ప్రజల గొంతుక పార్లమెంట్‌లో వినపడాలంటే తనను ఎంపీగా గెలిపించాలని నామ నాగేశ్వరరావు కోరారు. కాగా, ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి అమలుచేయని కాంగ్రెస్ ప్రజల కష్టాలను వదిలేసిందని విమర్శించారు.
- కేసీఆర్ హయాంలో రైతులకు రైతుబంధు, బీమా, సాగునీరు, ఉచిత కరెంట్ నిరంతరాయంగా అందాయని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. కావాలని కరువు తీసుకొచ్చిన కాంగ్రెస్ హామీలను విస్మరించిన విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి నామను గెలిపించాలని కోరారు. ఇంకా ఈ సమావేశంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, మేయర్ పునుకొల్లు నీరజ, నాయకులు గుండాల కృష్ణ, పగడాల నాగరాజు, బచ్చు విజయ్‌కుమార్, డోకుపర్తి సుబ్బారావు, బొమ్మెర రామ్మూర్తి, కర్ణాటి కృష్ణ, ఉప్పల వెంకటరమణ, శీలంశెట్టి వీరభద్రం, వగ్గెల పూజ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నగదు సీజ్

దమ్మపేట: ఆధారాలు లేకుండా తరలిస్తున్న నగదును బుధవారం పోలీసులు సీజ్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మండలంలోని అల్లిపల్లి చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈక్రమంలో మందలపల్లి నుంచి రెండు వేర్వేరు బైక్‌లపై ఒకరు రూ.4 లక్షలు, మరొకరు రూ.51,000 తీసుకెళ్తున్నారు. ఎటువంటి ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నగదును సీజ్ చేసి, కేసు నమోదు చేశామని ఎస్సై సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

ఐటీసీ కార్మికుడి మృతి

విధులకు హాజరై అస్వస్థత

బూర్గంపాడు: ఐటీసీలో విధులకు హాజరైన కార్మికుడు అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. అశ్వాపురం మండలం కల్యాణపురం గ్రామానికి చెందిన చల్లా పుష్పరాజు(48) సారపాకలోని ఐటీసీ కర్మాగారంలో విధులు నిర్వహిస్తున్నాడు. ఈ నెల 23న ఉదయం విధులకు హాజరైన ఆయన మధ్యాహ్నం సమయంలో అస్వస్థతకు గురయ్యాడు. తోటి కార్మికులు అధికారులకు సమాచారం అందించి ప్రథమ చికిత్స అనంతరం భద్రాచలం తరలించారు. వైద్యుల సూచన మేరకు ఖమ్మం తరలించే క్రమంలో మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతుడి కుమారుడు అవినాష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడ్డ మహిళ మృతి


లాలి(ఫైల్)

టేకులపల్లి: రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై చికిత్స పొందుతున్న మహిళ బుధవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని ప్రెగళ్లపాడు పంచాయతీ తూర్పుగూడేనికి చెందిన బాణోతు లాలి (58) భర్తతో పాటు కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. కాగా కొద్ది రోజుల క్రితం భద్రాచలంలో ఉంటున్న చిన్న కుమారుడి వద్దకు వెళ్లింది. గత జనవరి 23న చిన్న కుమారుడు బైక్‌పై తల్లిని తీసుకుని స్వగ్రామానికి బయలుదేరాడు. బూర్గంపాడు క్రాస్‌రోడ్డు వద్దకు రాగానే రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. దీంతో లాలికి ఛాతిలో, తలకు బలమైన గాయాలయ్యాయి. కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించారు. కొద్ది రోజుల నుంచి ఇంట్లోనే ఉంటూ మందులు వాడుతోంది. ఆరోగ్యం క్షీణించి బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి భర్త బికారియా, ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..


మోహన్ (ఫైల్)

తిరుమలాయపాలెం: దండెం ఆరేసిన టీ షర్ట్ తీసుకునేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. మండలంలోని బచ్చోడుతండా పరిధి కీర్యాతండాకు చెందిన భూక్యా మోహన్(38) ఖమ్మంలో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం ఆయన ఇనుప దండెం తీగపై ఆరవేసిన టీ షర్ట్ తీసేందుకు వెళ్లగా తీగకు కరెంట్ సరఫరా అవుతుండడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మోహన్‌కు భార్య శిరీష, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం మత్తులో ఘర్షణ

ఖమ్మంరూరల్: మండలంలోని ముత్తగూడెంకు చెందిన కొంపెల్లి నరేష్, కూరపాటి గణేష్ మద్యం మత్తులో పరస్పరం దాడి చేసుకోగా గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... స్నేహితులైన నరేష్, గణేష్ మంగళవారం అర్ధరాత్రి వరకు మద్యం సేవించారు. అనంతరం ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా పరస్పరం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామారావు తెలిపారు.

రైతు నిర్లక్ష్యంతో ఎగిసిపడిన మంటలు

కొణిజర్ల: పంట చేనులో ఉన్న మొక్కజొన్న బెరడు కాల్చడానికి ఓ రైతు చేసిన ప్రయత్నం పెనుచిచ్చుగా మారింది. చివరికి పెట్రోలు బంక్ సమీపానికి మంటలు రావడంతో ఫైర్ సిబ్బంది సకాలంలో రాగా పెను ప్రమాదం తప్పినట్లయింది. మండలంలోని తనికెళ్లలో పెట్రోల్ బంక్ సమీపాన ఉన్న రైతు తన పొలంలో చెత్త కాల్చడానికి మంట పెట్టాడు. అయితే, వడగాలులతో మంటలు ఎగిసిపడుతూ రోడ్డు పక్కన ఉన్న చెట్లకు అంటుకుని బంక్ వరకు వచ్చాయి. దీంతో బంక్ సిబ్బంది అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారు చేరుకుని మంటలు ఆర్పడంతో పెనుప్రమాదం తప్పినట్లయింది.

మొక్కజొన్న కంకి ఆహుతి

బోనకల్: మండలంలోని ఆళ్లపాడుకు చెందిన కౌలు రైతు అల్లిక లక్ష్మీనారాయణ పొలంలో సాగుచేసిన మొక్కజొన్న అగ్నికి ఆహుతైంది. ఆయన సమీపంలోని మరో రైతు మొక్కజొన్న దంటుకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించి కుప్ప పోసిన లక్ష్మీనారాయణ కంకులకు అంటుకున్నారు. దీంతో రూ.50వేల విలువైన పది క్వింటాళ్ల మొక్కజొన్నలు కాలిపోయాయని బాధిత రైతు తెలిపాడు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,174

విద్యార్థుల తికమక

- ఓపెన్ పరీక్ష కేంద్రాల పేర్లలో కొరవడిన స్పష్టత
- ప్రతీసారి అయోమయానికి గురవుతున్న విద్యార్థులు
- నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు
- విద్యార్థులు గంట ముందే కేంద్రాలకు చేరుకుంటే మేలు



కొత్తగూడెంఅర్బన్: ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా విద్యాశాఖ పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది. గురువారం నుంచి మే 2 వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండున్నర గంటల నుంచి 5:30 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. పదో తరగతి పరీక్షలు మూడుసెంటర్లలో 846 మంది, ఇంటర్మీడియట్ పరీక్షలు నాలుగు కేంద్రాల్లో 978 మంది రాయనున్నారు. ఇప్పటికే పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి.

పరీక్ష కేంద్రాలతో తంటా

ఓపెన్ పదో తరగతి పరీక్షకు కొత్తగూడెం పోస్టాఫీసు సెంటర్‌లోని సెయింట్‌మేరీ పాఠశాల, సింగరేణి కాలరీస్ పాఠశాల, బాబుక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. పదో తరగతి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులూ లేవు. ఇంటర్మీడియట్‌కు పాతకొత్తగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(ఆనందఖని పాఠశాల), కోర్టు పక్కన ఉన్న చుంచుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల(సింగరేణి ఆస్పత్రి రోడ్డు), బాబుక్యాంపులోని లిటిల్‌బడ్స్ పాఠశాలల్లో కేంద్రాలు కేటాయించారు. విద్యార్థుల హాల్ టికెట్లలో పాతకొత్తగూడెంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల ఆనందఖని పాఠశాల అని, బూడిదగడ్డలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పాతకొత్తగూడెం పాఠశాల అని నమోదు చేస్తున్నారు. దీంతో పాతకొత్తగూడెం వెళ్లాల్సిన విద్యార్థులు రుద్రంపూర్‌కు సమీపంలోని ఆనందఖనికి, బూడిదగడ్డ పాఠశాలకు వెళ్లాల్సిన విద్యార్థులు పాతకొత్తగూడెం పాఠశాలకు వెళ్తున్నారు. దీనివల్ల పరీక్ష సమయానికి చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. గత మార్చిలో జరిగిన పదో తరగతి రెగ్యులర్ పరీక్షల్లో ఓ విద్యార్థి బూడిదగడ్డలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్ష రాయాల్సి ఉండగా, అతను అయోమయానికి గురై బాబు క్యాంపు పాఠశాలకు వెళ్లాడు. అక్కడి నుంచి పోలీసు జీపులో పాతకొత్తగూడెం పాఠశాలకు, అక్కడి నుంచి బూడిదగడ్డ పాఠశాలకు వచ్చాడు. ఆ రోజూ పోలీసులు సహకరం అందించడం వల్లే సకాలంలో చేరుకుని పరీక్ష రాయగలిగాడు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు హాల్ టికెట్లలో పాఠశాలల వివరాలు స్పష్టంగా పేర్కొనాలని పలువురు కోరుతున్నారు. విద్యార్థులు కూడా పరీక్ష కేంద్రాలను ముందే సరిచూసుకుని, పరీక్ష సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకుంటే ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఉంటాయి.

● నిబంధనలు ఇలా..

ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, వాచీలు, ఎలక్ట్రానిక్ వస్తువుల అనుమతి ఉండదు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలని, సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఇప్పటికే పోలీస్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు. పరీక్ష కేంద్రం వద్ద అత్యవసర మందులతోపాటు ఏఎన్‌ఎం, సిబ్బంది వైద్య శాఖ ఆధ్వర్యంలో విధులు నిర్వహించనున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని తాగునీటిని అందుబాటులో ఉంచాలని, పరీక్ష సమయానికి ఆర్టీసీ బస్సులను నడిపించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకున్నట్లు జిల్లా విద్యాధికారులు తెలిపారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్‌ను సైతం ఏర్పాటు చేశారు. ఇతర సందేహాలు ఉంటే ఏసీజీఈ ఎస్.మాధవరావును 89192 79238 నంబరులో సంప్రదించాలని సూచించారు.

కేటీపీఎస్ సొసైటీలో గందరగోళం

- బదిలీ ఉద్యోగుల సభ్యత్వం తొలగించాలని తీర్మానం
- వారివల్ల తమకు అన్యాయం జరుగుతోందని ఇక్కడి ఉద్యోగుల ఆవేదన
- వైటీపీఎస్ ఉద్యోగి ఫిర్యాదుతో సహకార శాఖ అధికారుల విచారణ


సొసైటీ కార్యాలయంలో విచారణ అధికారి లక్ష్మీహరిత ముందే వాగ్వాదం చేస్తున్న డైరెక్టర్లు, సభ్యులు

పాల్వంచ: కేటీపీఎస్ కో ఆపరేటివ్ సొసైటీ నిర్వహణపై గందరగోళం నెలకొంది. కేటీపీఎస్ నుంచి బదిలీ అయిన ఉద్యోగులను ఇక్కడే సభ్యులుగా కొనసాగుతామని పేర్కొంటుండగా, వారి వల్ల తమకు రుణ మొత్తం పెరగడం లేదని ఇక్కడి ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయమై సొసైటీ డైరెక్టర్లు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు వాదోపవాదాలకు దిగుతున్నారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన ఉద్యోగుల సభ్యత్వాలు తొలగించాలని ఇటీవల సమావేశంలో తీర్మానం చేశారు. కాగా కొందరు సభ్యులను తొలగించేందుకు కుట్ర చేస్తున్నారంటూ ఓ ఉద్యోగి జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశాడు. దీంతో బుధవారం జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ (ఫీల్డ్) ఎ.లక్ష్మీహరిత విచారణ జరిపారు.

400 మంది ఇతర కర్మాగారాలకు బదిలీ

కేటీపీఎస్ కో ఆపరేటివ్ సొసైటీలో సుమారు నాలుగు వేల మంది ఉద్యోగులు సభ్యులుగా ఉన్నారు. వీరిలో ఇటీవల సుమారు 400 మంది ఉద్యోగులు ఇతర కర్మాగారాలకు బదిలీపై వెళ్లారు. నల్లగొండ జిల్లా దామర చర్ల యాదాద్రి పవర్ స్టేషన్(వైటీపీఎస్)కు సుమారు 170 బదిలీ అయ్యారు. సొసైటీ ప్రెసిడెంట్, సెక్రటరీలు దానం నర్సింహారావు, వల్లమల్ల ప్రకాశ్‌లు సైతం వైటీపీఎస్‌కు బదిలీపై వెళ్లారు. అయితే సొసైటీ పాలకవర్గ బాధ్యులుగా ఉండటంతో ఇక్కడి ఉద్యోగులకు సేవలు అందించాల్సి ఉంటుందనే కారణంతో మళ్లీ డిప్యూటేషన్‌పై కేటీపీఎస్‌కు వచ్చారు. ఉద్యోగులు కొంతకాలంగా తమ రుణాలను రూ.15 లక్షలకు పెంచాలని కోరుతున్నారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులు జిల్లా సహకార అధికారి అనుమతితో ఆ మేరకు రుణం పొందే అవకాశం ఉంది. వైటీపీఎస్‌లో పనిచేస్తున్నవారు రూ. 15 లక్షల రుణం పొందాలంటే అక్కడి డీసీఓ (హైదరాబాద్) నుంచి అనుమతి తీసుకోవాలి. దీంతో సమస్య ఉత్పన్నమైంది.

డైరెక్టర్లు, సభ్యుల వాగ్వాదం

వైటీపీఎస్ ఉద్యోగుల వల్ల తమకు రుణాలు అందడం లేదని కొందరు పేర్కొంటూ, వారి సభ్యత్వం తొలగించాలని ఇటీవల సర్వసభ్య సమావేశం నిర్వహించి తీర్మానం చేశారు. ఈ సమావేశానికి సెక్రటరీ మినహా డైరెక్టర్లందరూ హాజరయ్యారు. బైలాకు విరుద్ధంగా జనరల్ బాడీ సమావేశంలో సరైన కోరం లేకుండానే మినిట్స్ బుక్ బయటకు తీసుకెళ్లి సంతకాలు చేసి 400 మంది సభ్యులను తొలగించాలనే కుట్ర చేస్తున్నారంటూ వైటీపీఎస్‌లో ఫోర్‌మెన్‌గా పనిచేస్తున్న చావా విజయ్ జిల్లా సహకార అధికారికి ఫిర్యాదు చేశాడు. దీంతో అసిస్టెంట్ రిజిస్ట్రార్ విచారణ చేపట్టారు. జనరల్ బాడీ సమావేశంలో రిజిస్టర్‌లో సంతకాలు పెట్టిన జిరాక్స్‌లు బయటకు ఎలా వచ్చాయని కొందరు ఉద్యోగులు అధికారి ముందే వాదోపవాదాలకు దిగారు. ఇక్కడి పాలకవర్గ సభ్యులు ఇతర ప్రాంతాల ఉద్యోగులను తొలగించాలని తీర్మానం చేస్తే వారు కూడా బదిలీ అయిన స్థానాలకు వెళ్లాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో కావాలనే ఫిర్యాదు చేయించారని ఇక్కడి ఉద్యోగులు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో సొసైటీ డైరెక్టర్లు సైతం ఉద్యోగులతో ఘర్షణకు దిగారు. కాగా మూడు రోజుల్లోగా తమకు పూర్తి నివేదిక ఇవ్వాలని విచారణాధికారి ఆదేశించారు. ఈ వ్యవహారంపై అసిస్టెంట్ రిజిస్ట్రార్ లక్ష్మీహరితను వివరణ కోరగా.. విచారణ కొనసాగుతోందని, బైలా రిజిస్టర్, సమావేశ తీర్మానాలను పరిశీలిస్తున్నామని, నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామని వివరించారు.

ప్రతిభ చాటిన గురుకుల విద్యార్థులు

పాపకొల్లు విద్యార్థి మహేష్‌కు స్టేట్ ఫస్ట్ ర్యాంక్


మహేష్

జూలూరుపాడు: మండలంలోని పాపకొల్లు గ్రామానికి చెందిన సున్నం పిచ్చాచారి–నాగమణి దంపతుల కుమారుడు మహేష్ ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 1వ ర్యాంకు సాధించాడు. ఇతను ఏన్కూరు గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్ట్ ఇయర్ ఎంపీసీ చదువుతున్నాడు. బుధవారం విడుదలైన ఫలితాల్లో 468/470 మార్కులు సాధించాడు. మహేష్ తండ్రి కార్పెంటర్ పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ ముగ్గురు పిల్లలను చదివిస్తున్నాడు. ఈ సందర్భంగా మహేష్‌ను పలువురు అభినందించారు.

హఫీజ్‌కు 466 మార్కులు


హఫీజ్

ఇల్లెందు: ఇల్లెందు మైనారిటీ గురుకుల పాఠశాలకు చెందిన ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ విద్యార్థి ఎస్‌కే హఫీజ్ ఉత్తమ ప్రతిభ చూపాడు. బుధవారం ప్రకటించిన ఫలితాల్లో 466/470 మార్కులు సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్ తదితరులు అభినందించారు. ఇంకా కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులు ఎస్‌కె అర్షద్ 454/470, ఈశ్వర్ 447/470, రోహిత్ 427/470, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో వంశీ 935/1000, అఫ్సర్ 866/1000 మార్కులు సాధించారని తెలిపారు. అధ్యాపకులు కొండల్‌రావు, అశోక్, సైదావళి, సాధిక్, రేష్మా, నాగేష్, ప్రసాద్, గౌస్, ఇల్లందుల చైతన్య పాల్గొన్నారు.

గుంతలో పడిన అసిస్టెంట్ కమాండెంట్

- చేతిలోని తుపాకీ పేలి ఛాతిలోకి దూసుకెళ్లిన బుల్లెట్లు
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి


అసిస్టెంట్ కమాండెంట్ శేషగిరి (ఫైల్)

చర్ల: చర్ల మండలంలోని పూసుగుప్ప సీఆర్‌పీఎఫ్ క్యాంపులో విషాదం చోటు చేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా కూంబింగ్‌కు వెళ్లొస్తుండగా సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ గుంతలో కాలు జారి పడడంతో ఆయన చేతిలోని తుపాకీ పేలిగా బుల్లెట్లు ఛాతిలోకి దూసుకెళ్లాయి. దీంతో సహచర జవాన్లు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు... చర్ల మండలం పూసుగుప్ప సీఆర్‌పీఎఫ్ 81 బెటాలియన్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంవీ.శేషగిరి(45) విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన బలగాలతో కలిసి బుధవారం ఉదయం సమీప అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా చిన్న గుంతలో కాలు జారి పడ్డాడు. ఈ సమయాన ఆయన చేతిలోని తుపాకీ పేలి బుల్లెట్లు ఛాతిలోకి దూసుకెళ్లాయి. దీంతో సహచర జవాన్లు హుటాహుటిన క్యాంపునకు, అక్కడి నుంచి చర్ల, ఆపై భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే శేషగిరి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాగా, పూసుగుప్ప నుంచి జవాన్లు అంబులెన్స్‌లో వెళ్లే క్రమంలో ముందు, వెనుక ద్విచక్రవాహనాలు, కార్లతో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ వేగంగా భద్రాచలం తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఈమేరకు అసిస్టెంట్ కమాండెంట్ శేషగిరి మృతదేహం వద్ద ఎస్పీ రోహిత్‌రాజ్, ఓఎస్డీ సాయిమనోహర్, ఏఎస్పీ పరితోష్ పంకజ్, సీఆర్‌పీఎఫ్ అధికారులు నివాళులర్పించారు. కాగా, మృతుడు శేషగిరి స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా కాగా, ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎదురుకాల్పులు

చర్ల: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణపూర్ జిల్లాలో బుధవారం పోలీసులకు – మావోయిస్టులకు మధ్య పెద్ద ఎత్తున ఎదురుకాల్పులు జరిగాయి. నారాయణపూర్ జిల్లా ఓర్చా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బడేరాయనార్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారం మేరకు జిల్లా పోలీస్ ఫోర్స్, డీఆర్‌జీ, ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్స్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో పోలీసుల రాకను గుర్తించిన మావోయిస్టు సెంట్రీలు అప్రమత్తం చేయడంతో శిబిరంలో ఉన్న మావోయిస్టులు పోలీసులపైకి కాల్పులు జరుపుతూ పారిపోయారు. దీంతో పోలీసులు సైతం ఎదురు కాల్పులకు దిగారు. అనంతరం ఆ ప్రాంతంలో గాలించగా అక్కడ లభ్యమైన మందుగుండు సామగ్రి, విప్లవ సాహిత్యం, నిత్యావసర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

రూ. లక్ష స్వాహా!

సైబర్ కేసు నమోదు

ములకలపల్లి: ఆన్‌లైన్‌లో మోసం చేసిన ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఎస్సై రాజమౌళి కథనం ప్రకారం.. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు డీఐఓఆర్ అనే యాప్‌లో తొలుత రూ.25 వేలు పెట్టుబడి పెట్టారు. దీంతో యాప్ ద్వారా ప్రతి రోజూ రూ.1,650 నగదు తిరిగి జమ అవుతున్నట్లు చూపసాగింది. ఇది నమ్మిన బాధితులు పలు దఫాలుగా సుమారు రూ. లక్ష వరకు పెట్టుబడి పెట్టారు. అప్పటి నుంచి యాప్ పనిచేయడం లేదు. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు సైబర్‌క్రైమ్ 1930ని ఆశ్రయించడంతో పాటు బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బీఎస్పీ అభ్యర్థి నామినేషన్

ఖమ్మం పార్లమెంట్ నుంచి యెర్రా కామేష్ పోటీ


నామినేషన్ దాఖలు చేస్తున్న బీఎస్పీ అభ్యర్థి కామేష్

కొత్తగూడెంఅర్బన్: ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) అభ్యర్థిగా కొత్తగూడెం పట్టణానికి చెందిన, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ యెర్రా కామేష్ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. నామినేషన్ అనంతరం కామేష్ మాట్లాడుతూ 90 శాతానికి పైగా ఉన్న బహుజనులకు రాజ్యాధికారమే లక్ష్యంగా బీఎస్పీ పనిచేస్తోందని తెలిపారు. అన్ని పార్టీలు అగ్రవర్ణాలకు టికెట్లు కేటాయిస్తున్నాయని, బీఎస్పీ మాత్రమే జనరల్ స్థానాల్లో బీసీ, ఎస్సీలకు టికెట్లు కేటాయిస్తుందని తెలిపారు. రాజ్యాంగం పూర్తిస్థాయిలో అమలు పరిచేందుకు తమ పార్టీ కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఏనుగు గుర్తుపై ఓటు వేసి పార్లమెంట్ సభ్యుడిగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుర్ర ఉపేంద్ర సాహు, జిల్లా ఇన్‌చార్జి మేకతోట పుల్లయ్య, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అధ్యక్షులు చెరుకుపల్లి నాగేశ్వరరావు, గంధం మల్లికార్జున్‌రావు, నాయకులు మిరియాల నాగరాజు, బి.ఉపేందర్, సాయి, అల్లకొండ శరత్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఇద్దరికి గాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని సుభాష్‌నగర్ గ్రామపంచాయతీ లలితాపురం గ్రామం వద్ద బుధవారం ఆటో పల్టీ కొట్టడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఇల్లెందులో వివాహ వేడుకలకు హాజరై స్వగ్రామమైన తొడిదెలగూడేనికి ఆటోలో వెళుతుండగా ఆటో ముందు టైర్ బరస్ట్ కావడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో గాయపడిన నవ్య, సంతులను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఖమ్మం సిఫారసు చేశారు.

కొనుగోళ్లు వేగవంతం చేయండి

పౌరసరఫరాల శాఖ డీఎం త్రినాథ్‌బాబు


ధాన్యాన్ని పరిశీలిస్తున్న త్రినాథ్‌బాబు

అన్నపురెడ్డిపల్లి : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని పౌరసరఫరాల శాఖ డీఎం త్రినాథ్ బాబు అధికారులను ఆదేశించారు. మండలంలోని గుంపెన, రాజాపురం, అన్నపురెడ్డిపల్లి కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. రైతులు ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. తేమ 17 శాతం వచ్చిన తర్వాతే కాంటాలు వేయాలని సిబ్బందికి సూచించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. ఎండల తీవ్రత దృష్ట్యా కొనుగోలు కేంద్రాలలో రైతులకు తగిన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ సీఈఓ సున్నం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వృత్తినైపుణ్య శిక్షణతో స్వయం ఉపాధి

జిల్లా వ్యవసాయశాఖాధికారి బాబూరావు


మాట్లాడుతున్న బాబూరావు

కొత్తగూడెంరూరల్: వృత్తి నైపుణ్య శిక్షణతో గ్రామీణ ప్రాంత యువత స్వయం ఉపాధి పొందవచ్చని జిల్లా వ్యవసాయశాఖాధికారి వి.బాబూరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు రైతు వేదికలో బుధవారం జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో యువత వ్యవసాయంతోపాటు ఉద్యాన పంటలు, కూరగాయలు, చేపల పెంపకం, తేనెటీగల పెంపకం, పట్టుపురుగులు, పుట్టగొడుగులు, కోళ్లపెంపకం చేపట్టాలని సూచించారు. ఆర్థిక పరిస్థితి మెరుగు పడాలంటే స్వయం సమృద్ధి సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ డాక్టర్ శివ, సైంటిస్ట్ కేవీఆర్, కొత్తగూడెం ఏడీఏ జి.లాల్ చంద్, ఏఓ జి.దీపక్‌ఆనంద్ రైతులు పాల్గొన్నారు.

మహిళ మృతి.. రెండు రోజుల తర్వాత గుర్తింపు

ఖమ్మంక్రైం: ఖమ్మంలోని బుర్హాన్‌పురంలో నివసిస్తున్న ఓ వృద్ధురాలు రెండు రోజుల క్రితం మృతి చెందగా.. విషయాన్ని బుధవారం గుర్తించారు. ఖమ్మం టూటౌన్ పోలీసుల కథ నం ప్రకారం.. బుర్హాన్‌పురానికి అరుణ(66) భర్త రెండేళ్ల క్రితం మృతి చెందాడు. వీరి కుమారుడు ప్రతీక్ ఆస్ట్రేలియాలో ఉండడంతో అరుణ ఒంటరిగా నివసిస్తోంది. రోజులుగా ప్రతీక్ తన తల్లికి ఫోన్ చేస్తే రెండు రోజులుగా స్పందించడం లేదు. చివరకు ఇంటి పక్క వారికి ఫోన్ చేయడంతో బుధవారం సాయంత్రం వారు చూసేసరికి దుర్వాసన వస్తోంది. దీంతో పోలీసులు చేరుకుని ఇంటి తలుపులు పగులకొట్టి చూడగా అరుణ రెండు రోజుల క్రితం మృతి చెందినట్లు గుర్తించి, అన్నం ట్రస్ట్ బాధ్యులు అమరేశ్వరరావు సాయంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కాగా, అరుణ కుమారుడు ఆస్ట్రేలియా నుంచి వచ్చాక అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు


స్పృహ కోల్పోయిన కానిస్టేబుల్‌కు సపర్యలు చేస్తున్న స్థానికులు

అన్నపురెడ్డిపల్లి: రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు స్వల్పంగా గాయపడ్డ సంఘటన మండలంలోని వెంకటాపురం శివారులో బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ పిట్టల రాజులు కొండగట్టులో బందోబస్తు విధులు ముగించుకుని ద్విచక్రవాహనంపై తిరిగి దమ్మపేటకు వెళ్తున్నాడు. అదే సమయంలో అబ్బుగూడెం గ్రామానికి చెందిన హనుమంతరావు మద్యం మత్తులో వెంకటాపురం నుంచి తన గ్రామానికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెంకటాపురం గ్రామ శివారులో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కానిస్టేబుల్ రాజులు స్పృహ కోల్పోగా స్థానికులు సపర్యలు చేశారు. అనంతరం ఇద్దరిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సత్తుపల్లి తరలించారు. సంఘటనాస్థలాన్ని సందర్శించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిని ఆత్మహత్య

● ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో మనస్తాపం


వాగదాని వైశాలి (ఫైల్)

ముదిగొండ: ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలో గణితం సబ్జెక్టు ఫెయిల్ అయ్యాననే మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ముదిగొండకు చెందిన వాగదాని వైశాలి(17) జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో చదువుతోంది. ఆమె పరీక్షలు రాసిన సమయంలోనే మ్యాథ్స్ బీ పేపర్ సరిగా రాయలేదని తండ్రికి చెప్పగా.. మరోమారు రాసుకోవచ్చని నచ్చచెప్పారు. ఈనేపథ్యాన బుధవారం ఆమె తండ్రి గ్రానైట్ ఫ్యాక్టరీలో పనికి, తల్లి, నాయనమ్మ ఫంక్షన్‌కు వెళ్లారు. ఫలితాలు వెల్లడైనట్లు తెలుసుకున్న తండ్రి వైశాలికి ఫోన్ చేయగా మ్యాథ్స్ బీలో ఫెయిల్ అయినట్లు చెప్పగా ఏమీ కాదని సర్దిచెప్పాడు. ఇంతలోనే ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పని నుంచి వచ్చిన తండ్రి ఈ విషయాన్ని గుర్తించగా కన్నీరుమున్నీరు విలపించారు. ఘటనపై వైశాలి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ముదిగొండ ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

వడదెబ్బతో ఇద్దరి మృతి

ఖమ్మంరూరల్/కూసుమంచి: ఎండ తీవ్రత, వడగాలులతో జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు వడదెబ్బ బారిన పడగా బుధవారం మృతి చెందారు. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి శివారు రాజీవ్ గృహకల్పకు చెందిన భాస్కర్ల నీరజ(81) బుధవారం ఎండ వేడి తట్టుకోలేక తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే లోగా మృతి చెందింది. అలాగే, కూసుమంచికి చెందిన ప్రతాపనేని రవికుమార్(46) కొరియర్ కంపెనీలో డెలివరీ ఏజెంట్‌గా పనిచేస్తుండగా సోమవారం వడదెబ్బ తగిలింది. దీంతో ఖమ్మం ఆస్పత్రిలో చేర్పించగాచికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయనకు మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈమేరకుతహసీల్దార్ సురేష్‌కుమార్ వివరాలు సేకరించారు.

స్కూల్లో మ్యాథ్స్ అవర్... సైన్స్ అవర్ అంటుంటాం.
చట్టసభలో జీరో అవర్ అనే మాట వింటుంటాం.
స్టోరీ అవర్... ఈ గంట ఎక్కడ నుంచి వచ్చింది?
నీలిమ పెనుమర్తి ఆలోచన నుంచి వచ్చింది.
రోజుకో గంట కథలు వినమని చెప్తున్నారామె.
యూకేలో ఆచరణలో పెట్టి... ఇండియాకి తెచ్చారు.
విశ్వవ్యాప్తం చేయడానికి కంకణం కట్టుకున్నారు.
ఆడియో బుక్స్‌తో స్వచ్ఛమైన భాష నేర్పిస్తున్నారు.

కథలకో గంట 1/24

నీలిమ చెప్పే కథ చదవండి!




నీలిమ

హైదరాబాద్‌లో పుట్టి పెరిగిన నీలిమ ఉన్నత విద్య కోసం యూకేకి వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. పిల్లల పెంపకంలో కథలు కూడా ఒక భాగం అయి తీరాలని నమ్ముతారామె. మనదేశంలో స్కూల్ కరికులమ్‌లో పిల్లలకు కథలు లేకపోవడం విచారకరం అంటారామె. కథ ప్రాధాన్యం తెలిసిన అభివృద్ధి చెందిన దేశాలు పిల్లల రోజు వారీ క్రమంలో ఓ గంట కథల కోసం కేటాయిస్తున్నాయని, మన దగ్గర అది లోపించడంతో ఎంత పెద్ద చదువులు చదివినప్పటికీ ఒక విషయాన్ని చక్కగా కళ్లకు కట్టినట్లు వివరించగలిగిన నైపుణ్యం కొరవడుతోందన్నారు నీలిమ. భాష ఏదైనా ఆ భాషలో పదాలను స్పష్టంగా ఉచ్చరించడం అలవాటు చేయాలంటే ఇంట్లో తల్లిదండ్రులు అంత స్వచ్ఛంగా మాట్లాడే నేపథ్యం ఉండాలి. ఆ వెసులుబాటు లేని పిల్లలకు తన ప్రయత్నం మంచి భాషను, చక్కటి భావ వ్యక్తీకరణను నేర్పిస్తుందన్నారు నీలిమ. ఏడేళ్ల కిందట 'స్టోరీ అవర్' ఆలోచనకు బీజం పడిన సందర్భాన్ని 'సాక్షి'తో పంచుకున్నారామె.

ఓ గంట నిడివిలోనే కథ

"నాకు లండన్ ఇంపీరియల్ కాలేజ్‌లో కెమిస్ట్రీలో ఎంఎస్ చేయడానికి స్కాలర్‌షిప్ వచ్చింది. మా వారు కూడా స్కాలర్‌షిప్ మీద లండన్‌లోనే వచ్చారు. అలా 30 ఏళ్ల కిందట యూకేకి వెళ్లడం, చదువు, ఉద్యోగం, ఇద్దరు పిల్లలతో అక్కడే సెటిలయ్యాం. రెండవసారి గర్భిణిగా ఉన్నప్పుడు పీహెచ్‌డీలో విరామం తీసుకున్నాను. ఆ విరామం నా ఆలోచనలను కథల మీదకు మళ్లించింది. పెద్ద బాబుకి కథలు చెప్పడం మొదలుపెట్టాను. అమరచిత్ర కథ చదవడం అలవాటు చేశాను. అదే చిన్నబాబుకి కూడా అలవడింది. మా అబ్బాయిలిద్దరూ గ్రీక్ పౌరాణిక గ్రంథాలను కూడా చదివారు. వాళ్లిద్దరి మాటల్లో ఆ పాత్రల గురించిన చర్చ వస్తుండేది. అప్పుడు మన రామాయణాన్ని పరిచయం చేశాను. అదే సమయంలో మా పెద్ద బ్బాయి స్కూల్ వాళ్లిచ్చిన ప్రాజెక్ట్ కోసం ఒక స్టోరీ బోర్డ్ చేయాల్సి వచ్చినప్పుడు రామాయణం ఇతివృత్తంగా చేశాడు. ఆ తర్వాత పిల్లలకు సెలవుల్లో రామాయణం మీద వాళ్ల వెర్షన్ రాయమని చెప్పాను. ఆ టాస్క్‌లో మరో చాలెంజ్... కథనం గంటకు మించరాదు. తమకు తోచినట్లు ఎడిట్ చేసుకుంటూ సీతారామలక్ష్మణులు యుద్ధం తర్వాత విజేతలై అయోధ్యకు రావడం దీపావళి వేడుక చేసుకోవడంతో ముగింపు ఇవ్వాలన్నమాట. ఆ సాధన ఆడియో బుక్ ఆలోచనకు రూపమిచ్చింది.



సమయం లేని తల్లిదండ్రుల కోసం...

ఇప్పుడు ఉద్యోగాలు దాదాపుగా అందరి జీవితాలనూ సంక్షిప్తంగా మార్చేస్తున్నాయి. ఇలాంటప్పుడు పిల్లలకు కథ చెప్పాలని ఉన్నప్పటికీ కొంతమందికి అందు కోసం ఓ గంట సమయం కేటాయించలేని పరిస్థితి ఉంటోంది. వాళ్లకు ఉపయోగపడేటట్లు కథలకు ఆడియో బుక్ రూపమిచ్చాను. దానిని ఇంగ్లిష్, హిందీ, తెలుగులో తెచ్చాను. మా పిల్లలు శ్రేయాస్, ఆయుర్ ఇద్దరూ హిస్టరీ చదివారు. అక్కడ హిస్టరీ అంటే రష్యన్ విప్లవం, ఫ్రెంచ్ విప్లవం, ప్రపంచ యుద్ధాలు ప్రధానంగా ఉంటాయి. మా పిల్లలు అలాగే యూకేలో ఉన్న భారతీయమూలాలున్న పిల్లలకు మన చరిత్ర తెలియచేయాలనే ఉద్దేశంతో 'ఏ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ ఇండియన్ ఇండిపెండెన్స్ ఫ్రమ్ ద మొఘల్స్ టు ద మహాత్మా' పేరుతో మరో ఆడియో బుక్ చేశాను. ఆ స్టోరీ ఈస్ట్ ఇండియా కంపెనీ మనదేశంలో అడుగు పెట్టడం నుంచి మహాత్మాగాంధీ ఆధ్వర్యంలో స్వాతంత్య్ర సముపార్జన వరకు సాగింది. అలాగే మన సామెతలను పరిచయం చేయడానికి చేసిన ప్రయత్నమే 'తాతమ్మ కథలు'. మా అమ్మ, నాన్న, అత్త, మామగారితో ఒక్కో సామెతకు ఒక్కో కథ రాయించి వాటిని ఐదు నిమిషాలకు మించకుండా ఎడిట్ చేసి రికార్డ్ చేశాను. మొత్తం పన్నెండు కథలు, గంట ఆడియో. ఈ కథలకు నాకు మాల్గుడి డేస్ స్ఫూర్తి. యూకేలోని తెలుగు కుటుంబాల పిల్లలు ఈ కథలను వినడం మొదలు పెట్టిన తర్వాత తొలి రోజుకి పన్నెండవ రోజుకీ వారి ఉచ్చారణ మారిపోయింది. కథకు అంతటి శక్తి ఉంటుందనే నా నమ్మకం నిజమేనని నిరూపితమైంది. తోలుబొమ్మలతో చేసిన ప్రయోగానికి చాలా ఖర్చయింది, కానీ అది కూడా సంతృప్తినిచ్చింది. ఆరు పాత్రలతో కథను అల్లుకుంటూ రాసుకున్నాం. ఆడియో బుక్ అనువాదాలకు హైదరాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయ (ఉప్పల్) విద్యార్థులు, బేగంపేటలోని దేవనార్ (అంధ విద్యార్థుల పాఠశాల) స్కూల్ విద్యార్థులు గళమిచ్చారు.

– నీలిమ పెనుమర్తి, స్టోరీ అవర్ రూపకర్త



ఆడియో బుక్‌కి గళం ఇస్తున్న దేవనార్ స్కూల్ విద్యార్థులు ఆదిత్య, అనిల్, రంజిత్ (ఫైల్ ఫొటో)

పిల్లలే పాట రాశారు!

మాల్గుడి డేస్ వీడియోలకు సిగ్నేచర్ ట్యూన్ ఉన్నట్లే మా ఆడియో బుక్స్‌కి కూడా ట్యూన్ ఉండాలని పాట కోసం ప్రయత్నించాను. పిల్లలకు ఇస్తే ఎలా రాస్తారో చూద్దామని యూకేలో శచి అనే అమ్మాయికిచ్చాను. తాను రామాయణం కథను ఒక్క వాక్యంలో 'వారధి నిర్మాణం సీత మీద రాముడికి ఉన్న ప్రేమకు ప్రతిబింబం' అనే భావంతో రాసింది. అలాగే భారతీయ మూలాలు ఏ మాత్రం లేని 'ఎవీ సిమన్స్' అనే అమ్మాయి 'లైట్ ద ల్యాంప్స్' పేరుతో సీతారాములు విజేతలుగా అయోధ్యకు వచ్చి దీపావళి వేడుక చేసుకోవడాన్ని రాసింది. మంథర విషపూరిత వచనాలు ఎంతటి ప్రభావాన్ని చూపిస్తాయో వివరించింది.

క్రియేటివ్‌గా సైన్స్ పాఠాలు

బాల్యంలో మేము బాలానందం వినేవాళ్లం. సరళంగా సాగే కథనాలు పిల్లల్ని అలరించేవి. నా ఆడియోబుక్స్ కూడా సులువుగా ఉంటాయి. ఇవన్నీ 'స్టోరీ అవర్ డాట్ కో డాట్ యూకే' వెబ్‌సైట్‌లో ఉచితంగా ఉన్నాయి. భాష శుద్ధంగా ఉంటే ఆలోచనలు కూడా అంతే శుద్ధంగా ఉంటాయని నా అభిప్రాయం. మంచి భాష మాట్లాడితే వ్యక్తి గౌరవం పెరుగుతుంది. ఉద్యోగం, వ్యాపారాల కోసం ప్రపంచంలో ఎక్కడికెళ్లినా సరే... మంచి భాష ద్వారా చక్కటి అవకాశాలను అందిపుచ్చుకోగలుగుతారు. మంచి ఉచ్చారణ వ్యక్తి గౌరవాన్ని పెంచుతుంది. అందుకే సైన్స్ సబ్జెక్ట్‌ని కూడా ఈ క్రియేటివ్ మీడియం ద్వారా వివరించాలనేది నా ఆకాంక్ష" అని తన ప్రయత్నం వెనుక ఉన్న పరమార్థాన్ని వివరించారు నీలిమ పెనుమర్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి
ఫొటోలు : అనిల్ కుమార్ మోర్ల

వందేళ్ల చరిత్ర ఉన్న అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ
ఎప్పుడూ ఒక మహిళను వైస్ చాన్సలర్‌గా చూడలేదు.
కాని మొదటిసారి ప్రొఫెసర్ నైమా ఖాతూన్‌ను
రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వి.సి.గా నియమించారు.
దీంతో నైమా ఖాతూన్ చరిత్ర సృష్టించారు.
ఆమె మైనారిటీ వర్గ మహిళలకు గొప్ప స్ఫూర్తి కాగలదంటూ
శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. నైమా ఖాతూన్ పరిచయం.

న్యూస్‌మేకర్



ప్రొఫెసర్ నైమా ఖాతూన్

వందేళ్లకు ఆమె వచ్చింది

నైమా ఖాతూన్‌కు ముస్లిం మహిళల చదువు గురించి చాలా పట్టింపు ఉంది.

'ఉత్తరాదిలో నేను ప్రిన్సిపాల్‌గా పని చేసిన అలీగఢ్ విమెన్స్ కాలేజ్ చాలా ముందంజలో ఉంది. అక్కడ మూడు వేల మంది ముస్లిం ఆడపిల్లలు చదువుకుంటున్నారు. కాని ఇదొక్కటే సరిపోదు. ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో ముస్లిం బాలికల విద్య చాలా వెనుకబడి ఉంది. దక్షిణాదిలో ముస్లిం సమూహాలు విద్యా రంగంలో ముస్లిం బాలబాలికలను ప్రోత్సహిస్తున్నాయి. ఉత్తరాదిలో ఆ పని జరగడం లేదు. రాజకీయ, ఆర్థిక, సామాజిక వెనుకబాటుతనాన్ని జయించాలంటే విద్యార్జనకు మించిన వేరే మార్గమేదీ లేదు' అంటుందామె.

విద్యారంగంలో బాలికల విద్య కోసమే కాదు ఉన్నతవిద్యలో ముస్లింల ప్రాతినిధ్యం పెరగాలని కోరుకునే నైమా ఖాతూన్‌ను భారత ప్రభుత్వం గుర్తించి రెండు రోజుల క్రితం అత్యంత ప్రతిష్టాత్మకమైన అలీగఢ్ ముస్లిం విశ్వవిద్యాలయానికి వైస్ చాన్సలర్‌ను చేసింది. దాదాపు 100 ఏళ్లకు మించిన ఘన చరిత్ర ఉన్న ఈ విశ్వవిద్యాలయానికి ఇలా ఒక మహిళ వి.సి. పదవిలో కూచోవడం ఇదే మొదటిసారి.

గమనించాల్సిన విషయం ఏమంటే ఇన్నాళ్లు పురుషులు మాత్రమే వి.సి.లుగా ఉన్న జె.ఎన్.యుకు శాంతిశ్రీ పండిట్ మొదటి మహిళా వి.సి. కావడం, అలాగే జామియా మిలియా ఇస్లామియాకు నజ్మా అక్తర్ తొలి వి.సి. కావడం (ఆమె పదవీకాలం ముగిసింది) పాతమూసలను బద్దలు చేయడమే. ఆ వరుసలో ఇప్పుడు నైమా ఖాతూన్ చేరారు.

రాజకీయ ప్రాతినిధ్యం

భారతదేశంలో మహిళలకు రాజకీయ ప్రాధాన్యం లభించడం లేదని నైమా ఖాతూన్ అంటారు. ముఖ్యంగా అణగారిన వర్గాల స్త్రీలు పార్లమెంట్ వరకూ చేరుకోవడానికి చాలా అడ్డంకులు ఉన్నాయని, రాజకీయ అధికారం లేకుండా కీలకమైన విధానమార్పు తేలేమని అభిప్రాయపడతారు. 'ఆర్థిక శక్తిని, రాజకీయ శక్తిని పొందడటంలో అణగారిన వర్గాల స్త్రీలు నిస్సహాయంగా ఉన్నారు' అంటారామె.

సైకాలజీ ప్రొఫెసర్

ఒడిశాకు చెందిన నైమా ఖాతూన్ ఉన్నత విద్య అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీలోనే జరిగింది. అక్కడే ఆమె బి.ఎ. సైకాలజీ చదివింది. ఆ తర్వాత పి.హెచ్‌డి. వరకూ అక్కడే కొనసాగి 1988లో అదే యూనివర్సిటీలో లెక్చరర్‌గా తన ప్రయాణం మొదలెట్టింది. ఆ తర్వాత అసోసియేట్ ప్రొఫెసర్‌గా, ప్రొఫెసర్‌గా పదోన్నతి పొంది సైకాలజీ డిపార్ట్‌మెంట్ చైర్‌పర్సన్ అయ్యింది. పొలిటికల్ సైకాలజీ అధ్యయనంలో భాగంగా 'హిందూ ముస్లిం యువతపై రాజకీయ భావోద్వేగాల ప్రభావం' అనే అంశం మీద ఆమె చేసిన పి.హెచ్‌డి. కీలకమైనది. అలీగఢ్ విమెన్స్ కాలేజ్‌కు ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ ఉండగా ఆమెను వి.సి.గా పని చేసే అవకాశం వరించింది. ఇప్పుడు ఎలక్షన్ కోడ్ అమలులో ఉంది కనుక ఇ.సి. అనుమతి తీసుకోని ఆమె నియామకం చేసింది ప్రభుత్వం. నైమా ఖాతూన్ తరచూ అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో తన పరిశోధనా పత్రాలను సమర్పిస్తుంటారు.

బ్యూటిప్



- చేతులు, పాదాలపై నల్లటి మచ్చలుంటే వాడేసిన నిమ్మతొక్కతో రుద్దితే పోతాయి.
- సమ్మర్‌లో బయటకు వెళ్లేటప్పుడు పాదాలకు సాక్స్ వేసుకుంటే పగుళ్ళు రాకుండా ఉంటాయి.
- రాత్రి పడుకునే ముందు పాదాలను శుభ్రంగా కడిగి ఆరిన తర్వాత మసాజ్ క్రీమ్ లేదా ఆయిల్‌తో ఐదు నిమిషాల పాటు మర్దన చేయాలి.
- పదిహేను రోజులకు ఒకసారి పెడిక్యూర్ చేసుకోవాలి.
- స్నానం పూర్తయిన తర్వాత పమిస్ స్టోన్‌తో పాదాలను మెల్లగా రుద్దాలి. ఇలా చేస్తే మృతకణాలు తొలగిపోయి పాదాలు నునుపుగా ఉంటాయి.

బాధ పడి ఆ బాధను కాలగమనంలో మరచిపోయేవారు కొందరు.

బాధ పడి ఆ బాధలో నుంచి కొత్త అడుగు వేసే వారు కొందరు.

కలైయారసి రెండో కోవకు చెందిన మహిళ.

నేతకార్మికుల బంగారు కాలాన్ని కళ్లతో చూసిన కలైయారసి అవే కళ్లతో వారి కష్టాలను చూసింది. ఆ బాధలో నుంచి 'రాట్టై' స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది.

సంప్రదాయ నేతకళకు డిఐవై(డూ ఇట్ యువర్ సెల్ఫ్) కిట్స్ ద్వారా కొత్త వెలుగు తెస్తోంది తమిళనాడుకు చెందిన కలైయారసి రామచంద్రన్. పిల్లలు, పెద్దలు ఉపయోగించేలా ఈ కిట్‌ను డిజైన్ చేశారు. సంప్రదాయ కళకు విస్తృత ప్రాచుర్యం కల్పిస్తున్న కలైయారసి గురించి....

కొత్త దారి



కలైయారసి

నేతకళ నేస్తం

సాఫ్ట్‌వేర్ టు వీవింగ్

కొన్ని సంవత్సరాల క్రితం...

'చదువుకోవాలని ఉంది' అని తన మనసులోని మాటను భర్తకు చెప్పింది కలైయారసి. పెళ్లికి ముందు పై చదువులు చదువుకోడానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డుగోడలుగా నిలిచాయి. ఆర్థిక ఇబ్బందుల వల్ల పై చదువులకు తల్లిదండ్రులు ససేమిరా అన్నారు. కలైయారసి మనసులో మాట విన్న భర్త 'తప్పకుండా' అని ప్రోత్సహించాడు. అలా కలైయారసి ఎంసీఏ పూర్తి చేసింది. ఆ తరువాత ఒక ఐటీ కంపెనీలో డెవలపర్‌గా పని చేసింది.

ఈరోడ్(తమిళనాడు) జిల్లాలోని సాలంగపాలయం గ్రామానికి చెందిన కలైయారసి నేతకార్మికుల కుటుంబం నుంచి వచ్చింది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేసినా నేతకళపై ఆమెకు ఉన్న ప్రత్యేకాభిమానం మాత్రం దూరం కాలేదు. సెలవుల్లో సొంత ఊరుకు వచ్చిన కలైయారసి అక్కడ నేతకార్మికుల కష్టాలను ప్రత్యక్షంగా చూసింది. ఊళ్లో చేనేత మగ్గాల సంఖ్య 7,500 నుంచి 2,500కు పడిపోయింది.

కష్టాలలో ఉన్న నేతకార్మికులకు ఆసరాగా నిలవడానికి తన వంతుగా ఏదైనా చేయాలనుకుంది కలైయారసి. నేతకళ గురించి మరిన్ని వివరాలు తెలుసుకొని 'రాట్టై హ్యాండ్లూమ్' పేరుతో స్వగ్రామంలో ఎకో–ఫ్రెండ్లీ హ్యాండ్లూమ్ స్టార్టప్‌కు శ్రీకారం చుట్టింది. పర్యావరణహిత కోణంలో ఆలోచించి ఆర్గానిక్ క్లాత్ వీవింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టింది.

'నేతపని ద్వారా ఉపాధి పొంది సంతోషంగా ఉన్న కార్మికుల ఆర్థికపరిస్థితి ఆ తరువాత దిగజారిపోయింది.

చాలామంది ఉపాధి వెదుక్కుంటూ పట్టణాల బాట పట్టారు. డబుల్ షిఫ్టులలో పనిచేసేవాళ్లు. కొందరు వాచ్‌మెన్‌గా పని చేశారు. తల్లిదండ్రులు ఊళ్లో లేకపోవడంతో పిల్లల చదువు గాడి తప్పింది. తమిళనాడులో ఎన్నో గ్రామాలకు వెళ్లి నేతకార్మికులతో మాట్లాడి వారి కష్టాలు తెలుసుకున్నాను. ఈ పరిస్థితి నాకు బాధాకరంగా అనిపించింది' అంటున్న కలైయారసి తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి నేతకళను స్వయంగా నేర్చుకుంది. సహజరంగులతో పాటు అరటి పీచు, జనపనార, ఇతర పదార్థాలతో తయారుచేసిన సేంద్రియ నూలును 'రాట్టై' ఉపయోగిస్తోంది. ప్రస్తుతం 28 కుటుంబాల వరకు 'రాట్టై హ్యాండ్లూమ్' కోసం పనిచేస్తున్నాయి.

సంప్రదాయ చేనేత వస్త్రాలకు ఊతం ఇచ్చేందుకు పోర్టబుల్ డిఐవై హ్యాండ్లూమ్ కిట్‌ల ఆలోచనకు శ్రీకారం చుట్టింది కలైయారసి.

ఎక్కడికంటే అక్కడికి చేతితో తీసుకెళ్లగలిగే ఈ మగ్గాలకు యూజర్ మాన్యువల్, క్యూ ఆర్ కోడ్ ఉంటుంది. దీని ద్వారా యూట్యూబ్ వీడియోల సహాయంతో పరికరాన్ని ఎలా ఉపయోగించాలో తెలుసుకోవచ్చు. తమిళనాడులోని ఎన్నో స్కూల్స్‌లో పిల్లల దగ్గర పోర్టబుల్ లూమ్స్ కనిపిస్తున్నాయి. స్కూల్స్‌లో వీవింగ్ క్లబ్స్ ఏర్పాటు కావడం మరో విశేషం. మూడు ఆప్షన్‌లలో, మూడు స్థాయుల్లో అందుబాటులో ఉన్న వీటిని పెద్దలు, పిల్లలు ఉపయోగించవచ్చు.

'రాట్టై' స్టార్టప్ 'రైజింగ్ స్టార్ ఆఫ్ ది ఇయర్' అవార్డ్ గెలుచుకుంది. టాన్‌సీడ్ (తమిళనాడు స్టార్టప్ అండ్ ఇనోవేషన్ మిషన్) ద్వారా పది లక్షల గ్రాంట్ వచ్చింది.

'నేతకార్మికులకు ఉపాధి కల్పించడమే కాదు ఈ తరానికి ఆ కళపై ఆసక్తి కలిగేలా, నేర్చుకునేలా చేయాలనేది నా లక్ష్యం' అంటుంది కలైయారసి.

పిల్లల కోసం వర్క్‌షాప్



'రాట్టై' ద్వారా నేత కార్మికులకు అండగా నిలిస్తూనే మరో వైపు నేతకళపై పిల్లలకు అవగాహన, ఆసక్తి కలిగించడానికి వర్క్‌షాప్‌లు నిర్వహిస్తోంది కలైయారసి. పెద్దలకు 'నేతపనిని స్ట్రెస్–బస్టింగ్ ఎక్సర్‌సైజ్‌గా పరిచయం చేస్తోంది. వీలైనన్ని ఎక్కువ స్కూల్స్‌కు వెళ్లి పిల్లలకు నేతకళ గురించి చెప్పాలనుకుంటున్నాను. ఒక ఆర్ట్‌గా మన విద్యావిధానంలో నేతకళ భాగం కావాలని ఆశిస్తున్నాను' అంటుంది కలైయారసి.

ఈ భూగోళం మీద ప్లాస్టిక్ తొడుగు ఉంది. అది నీటిలో నానదు. మట్టిలో కలవదు. నిప్పులో కాల్చితే విషంగా మారుతుంది. అలాంటి ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి. లేదా రీసైకిల్ చేయాలి. అందుకే అసోంలోని ఆ స్కూల్ 2016లో వృథా ప్లాస్టిక్కే స్కూల్ ఫీజ్‌గా ప్రారంభమైంది. ఏడేళ్లు గడిచినా దిగ్విజయంగా నడిచి పర్యావరణ హితమైన స్కూల్‌గా ప్రశంసలు అందుకుంటోంది.

● వినూత్నం

ఆ స్కూల్ ప్లాస్టిక్‌పై గెలిచింది

ఫీజుకు బదులు ప్లాస్టిక్ వేస్ట్‌ను ఎవరైనా తీసుకుంటారా? ఆ స్కూల్‌లో తీసుకుంటారు. ఎంత వేస్ట్ తెస్తే అంత మెచ్చుకుంటారు కూడా. పర్మితా శర్మ, మజిన్ ముఖ్తార్ అనే పర్యావరణ ప్రేమికుల, బాలల హితుల వినూత్న ఆలోచన ఇది. అసోంలోని పమోహీలో 'అక్షర్' పేరుతో వీరిద్దరూ ఒక పాఠశాల స్థాపించారు 2016లో. దీనిని భిన్నంగా నడపాలని నిశ్చయించుకున్నారు. చదువు, స్కిల్స్, పర్యావరణ స్పృహ సిలబస్‌గా ఉండాలనుకున్నారు. అందుకే ఫీజు కట్టాలంటే నోట్లు తేవద్దు వేస్ట్ ప్లాస్టిక్ తెండి అని చెప్పసాగారు. వీలైనన్ని ప్లాస్టిక్ వ్యర్థాలు తీసుకెళ్తే ఫీజు కట్టినట్లు రసీదు ఇస్తారు. మరో విషయం ఏమిటంటే ఇక్కడ విద్యార్థులను వారి వయసును బట్టి కాకుండా అవగాహన స్థాయిని బట్టి తరగతుల్లో వేస్తారు. ఎనిమిదేళ్లు వచ్చిన వారు 3వ క్లాస్‌లో ఉండాలని రూల్ లేదు. నాలుగులో ఉండొచ్చు లేదా రెండులోనూ ఉండొచ్చు.



స్కూల్ ఫీజుగా ప్లాస్టిక్‌ను ఇస్తున్న విద్యార్థులు



ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేస్తున్న విద్యార్థులు

ప్లాస్టిక్ భూతం నుంచి కాపాడాలని

మనుషులు బాగా చలి పుడితే దేనితోనైనా చలిమంట వేసుకోవడానికి వెనుకాడరు. అసోంలో చలి ఎక్కువ. కాని కట్టెలు ఖర్చు. అందుకే చలిమంటల కోసం ప్రజలు ప్లాస్టిక్ బాటిళ్లను, కవర్లను తెచ్చి మంటల్లో వేయసాగారు. ప్లాస్టిక్ వ్యర్థాలను బహిరంగంగా తగులబెట్టడం పర్యావరణానికి తీవ్రమైన హాని. దీనిపై అక్కడి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎంత ప్రయత్నించినా ఫలితం రాలేదు. దానికి తోడు ప్లాస్టిక్ తగులపెట్టడం వల్ల వెలువడే విష వాయువులు పీల్చి పిల్లలు జబ్బు పడసాగారు. దీంతో సామాజిక కార్యకర్త అయిన పర్మితా శర్మకు ఓ ఆలోచన తట్టింది. తన మిత్రుడు, అమెరికాలో బాలల విద్యారంగంలో పని చేస్తున్న నిపుణులు మజిన్‌తో తన ఆలోచనను పంచుకుంది. అసోం భౌగోళిక పరిస్థితుల గురించి, అక్కడ నెలకొన్న సవాళ్ల గురించి మజిన్‌కు వివరించింది. అలా వారిద్దరి ఆలోచనలో నుంచి పుట్టుకొచ్చిందే 'అక్షర్' విద్యాలయం.

ఎవరు చేరుతారు?

స్కూలంటే డబ్బు తీసుకుని చదువు చెప్పాలి. ప్లాస్టిక్ తెండి స్కూల్‌లో చేరండి అంటే ఎవరు చేరతారు. పైగా సంప్రదాయ విద్యకు, వృత్తి విద్యకు మధ్య వారధిగా ప్రారంభించిన ఈ పాఠశాలకు విద్యార్థులను రప్పించడం మొదట్లో సవాలుగానే మారింది. ఇక అక్కడి పేద పిల్లలు దగ్గర్లోనే ఉన్న రాళ్ల క్వారీలలో పనిచేస్తారు. వారిని బడికి పంపిస్తే ఆదాయం కోల్పోతామని తల్లిదండ్రులు పిల్లల్ని స్కూలుకు పంపేందుకు ససేమిరా అన్నారు. దీంతో తల్లిదండ్రుల అవసరాలకు తగిన విధంగా స్కూల్ సమయాన్ని, బోధనను 'అక్షర్' లో రూపకల్పన చేశారు.

ప్లాస్టిక్ ఇటుకలు

'అక్షర్'లో నెదర్లాండ్స్ నుంచి తెప్పించిన మెషినరీ ద్వారా ప్లాస్టిక్ రీసైక్లింగ్ చేస్తారు. పాత ప్లాస్టిక్‌తో ఇటుకలు తయారు చేస్తారు. వీటిని నిర్మాణాల్లో వాడొచ్చు. పిల్లలు స్కూల్ అయ్యాక ఈ ఇటుకల తయారీ నేర్చుకుంటున్నారు. అలాగే పూలకుండీలు, బౌల్స్ వంటివి ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నారు. ఇప్పటి వరకూ దాదాపు రెండున్నర వేల ప్లాస్టిక్ బాటిళ్లు, ఏడు లక్షల ప్లాస్టిక్ కవర్లు ఇక్కడ రీసైకిల్ అయ్యాయి. అసోంను ప్లాస్టిక్ పీడ నుంచి విముక్తం చేయాలంటే తమ స్కూల్ మోడల్‌ని ఫాలో కావాలని పర్మిత, మజిన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికి 5 స్కూళ్లు ఈ విధానాన్ని అవలంబిస్తున్నాయి. అంటే ఫీజుగా ప్లాస్టిక్‌ను తీసుకుంటున్నాయి. మరో వంద స్కూళ్లు ఇలా చేస్తే బాగుంటుందని పర్మిత, మజిన్ భావిస్తున్నారు. అసోంలో మాత్రమే కాదు దేశమంతా ఈ మోడల్‌ను ఉపయోగిస్తే ప్లాస్టిక్ వ్యర్థాలను కచ్చితంగా తరిమికొట్టడం వీలవుతుంది.